క్లుప్తంగా

అంతర పంటల సాగుతో ఆదాయం

నాగారం : ఆయిల్‌పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులు మూడు సంవత్సరాల పాటు అంతర పంటలను సాగు చేసుకొని అధిక ఆదాయం పొందవచ్చని పతంజలి ఆయిల్ పామ్ క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు అన్నారు. శనివారం డి.కొత్తపల్లిలో మాజీ సర్పంచ్ యానాల నర్సింహారెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను సందర్శించారు. అంతర పంటగా కూరగాయలు సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్ పామ్ సాగు చేసుకునే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు కల్పిస్తున్నాయని తెలిపారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలను సాగు చేసినట్లయితే ఎకరాకు రూ.1లక్ష ఆదాయం పొందవచ్చని అన్నారు. ఆయిల్‌పామ్ గెలల ధర ప్రస్తుతం టన్నుకు రూ.20,500 పలుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు యానాల నర్సింహారెడ్డి, సతీష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం కమిటీ ఎన్నిక


రామ్మూర్తిగౌడ్


యాదగిరిగౌడ్

సూర్యాపేట: గౌడ ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన కమిటీని శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా బెల్లంకొండ రామ్మూర్తిగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా కాంపాటి రాధాకృష్ణగౌడ్, ప్రధాన కార్యదర్శిగా చిత్తలూరు యాదగిరిగౌడ్, కోశాధికారిగా గుణగంటి వెంకటేశ్వర్లుగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఏలుగూరు కిరణ్‌గౌడ్, అసోసియేట్ అధ్యక్షులుగా బెల్లంకొండ రామచంద్రంగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా పబ్బతి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ ఉద్యోగుల సంఘం నాయకులు సాయిబాబాగౌడ్, వెంకటయ్య గౌడ్, కనకమల్లుగౌడ్, తండు అంజయ్యగౌడ్, దేశగాని పాపయ్యగౌడ్, అల్లాడి సత్యనారాయణగౌడ్, చికూరి కృష్ణగౌడ్, మండవ కృష్ణమూర్తి, సురభి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలి

సూర్యాపేటటౌన్ : తన భూమి ఆక్రమణను అడ్డుకోవాలని బాధితుడు గుండపనేని సుధాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ ఫేక్ పాస్‌బుక్ సృష్టించి, అక్రమంగా తన భూమిని ఆక్రమించుకుంటున్నాడని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్‌లో 232 సర్వే నంబర్‌లో 50 గుంటల భూమిని తాను 1990లో కొనుగోలు చేసినట్టు తెలిపారు. రాంచందర్ నాయక్ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి తమ భూమి పైకి వచ్చి ఆక్రమించుకుంటున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోఉమ్మడి జిల్లా కలెక్టర్ శ్యామ్ రిజ్వీ సదరు నకిలీ పాస్ బుక్కును రద్దు చేస్తూ నాటి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. తమ భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న రాంచందర్ నాయక్‌పై ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు వివరించారు.

నూతన కమిటీ ఎన్నిక


మల్లారెడ్డి

మద్దిరాల : రెడ్డి సంఘం మండల నూతన కమిటీని మండల కేంద్రంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎలిపెద్ది మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా బద్దం సంజీవరెడ్డి, షేరి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గూడా వెంకటరెడ్డి, యువజన అధ్యక్షుడిగా ఏలేటి శ్యాంరెడ్డి, యువజన సంఘం ఉపాధ్యక్షుడిగా ఎల్లు అశోక్‌రెడ్డి, కార్యదర్శిగా నల్ల మధురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు వాసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏలేటి నారాయణరెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక సేన అధ్యక్షుడిగా ఖాజా యాదవ్

అర్వపల్లి : కాంగ్రెస్ అనుబంధ సాంస్కృతిక సేన జాజిరెడ్డిగూడెం మండల అధ్యక్షుడిగా జాజిరెడ్డిగూడెనికి చెందిన వల్లాల ఖాజాయాదవ్ నియమితులయ్యారు. సాంస్కృతిక సేన రాష్ట్ర అధ్యక్షుడు చక్రాల రఘు ఆదేశానుసారం జిల్లా అధ్యక్షుడు ఎర్ర అనుదీప్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తడకమల్ల పరశురాములు శనివారం ఆయనను నియమించారు. ఈ సందర్భంగా ఖాజాయాదవ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

చింత నరేందర్‌కు డాక్టరేట్


నరేందర్

పెన్‌పహాడ్ : లింగాల గ్రామానికి చెందిన చింత నరేందర్‌కు డాక్టరేట్ లభించింది. ఈయన మైసూర్‌లోని జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ యూనివర్సిటీలో న్యూరోఫామకాలజీ విభాగంలో ఎన్వెస్టిగేషన్ మాలిక్యూలర్ మెకానిజం అల్జీమర్స్‌పై పరిశోధన చేశారు. డాక్టర్ జస్టిన్ సూచనలతో పరిశోధనను పూర్తి చేశారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ చంద్రచూడ్, యూనివర్సిటీ నిర్వాహకుల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

ఘనంగా కూడార్వై వేడుకలు


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో స్వామి, అమ్మవార్లకు పాయస పూజ చేస్తున్న భక్తులు


ఆత్మకూర్(ఎస్) : చెన్నకేశవస్వామి ఆలయంలో..


తుంగతుర్తి : రామాలయంలో..


నూతనకల్ : మిర్యాలలో..

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని శ్రీభూగోదా సమేత లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం కూడార్వై పాయస నివేదన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 గంగాళాలతో పాయస నివేదన పూజ జరిపారు. స్వామి, అమ్మవారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం కూడార్వై పాయసాన్ని భక్తులకు వితరణ చేశారు. మహిళలు గోదాదేవికి మంగళహారతులు ఇచ్చి కుంకుమార్చన చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు నూగురు వెంకట రంగాచారి, శ్రీనివాసచారి, రమాకాంత చారి, శ్రీకాంతాచారి, వెంకటాచారి, గ్రామస్తులు లింగారెడ్డి, యాకయ్య, కృష్ణమూర్తి, గోదా గోష్ఠి సభ్యులు పాల్గొన్నారు.

108 గంగాళాలతో పాయస పూజ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా శనివారం 27వ రోజు నర్సింహస్వామి, గోదాదేవిలకు పాయస పూజ చేశారు. 108 గంగాళాలతో మహిళలు పాయసాన్ని సమర్పించారు. అలాగే మహిళలు మంగళహారతులతో గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

నూతనకల్ : మిర్యాల గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో కూడార్వై ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. గోదాదేవికి 108 పాత్రల్లో పాయసం నివేదన చేశారు. లక్ష తులసి కుంకుమార్చన, సేవాకాలం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో దేవాలయ కమిటీ చైర్మన్ గోరుగంటి రాంచందర్‌రావు, మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య, దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, గునగంటి వెంకన్న, కనకటి వెంకన్న, వేల్పుల రఘు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీపట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గోదాదేవికి మంగళహారతులతో గీతాలాపన చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. కార్యక్రమంలో పూజారి కాటూరి రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మోదీ విధానాలపై దేశవ్యాప్త పోరాటం

- సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాయిబాబా


మాట్లాడుతున్న సాయిబాబా

భానుపురి : మోదీ ప్రభుత్వం కార్మికులను దెబ్బతీసే విధానాలను అవలంభిస్తోందని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాయిబాబా ఆరోపించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఫిబ్రవరిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కార్మికులకు న్యాయం జరగకుంటే దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాంబాబు, నెమ్మాది వెంకటేశ్వర్లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, అనంతుల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి సోమన్న గౌడ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలి

లేబర్ కోడ్‌లను తక్షణమే విరమించుకోవాలని సీఐటీయూ ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబా ప్రభుత్వాలను కోరారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వంగూరు రాములు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామ్మోహన్‌రావు, కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదం శ్రీనివాస్, కోశాధికారి యల్కా సోమయ్యగౌడ్, సీహెచ్ లక్ష్మీనారాయణ, అనంతుల మల్లయ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నీళ్లు ఇవ్వాలని రైతుల రాస్తారోకో


రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

ఆత్మకూర్(ఎస్) : ఎస్సారెస్పీ కాల్వల ద్వారా మండలంలోని రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం రామోజీతండా వద్ద రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నీరు రాకపోవడంతో తాము వ్యవసాయం చేసుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాస్తారోకోకు బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి మద్దతు పలికారు. అధికారులు స్పందించి వెంటనే ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో సందర్భంగా రోడ్డుపై ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచి ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో రైతులు బిక్కు నాయక్, నరేందర్, రమేష్, చాంప్లా, బిచ్చ, లింగా, మల్సూర్, సైదులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న రాములు

సూర్యాపేటటౌన్ : తెలంగాణ రాష్ట్రంలోని విద్యారంగంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సూర్యాపేట డివిజన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను అమలు చేయాలని అన్నారు. ఆదర్శ పాఠశాలలు, గురుకులాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 ద్వారా జీతాలు అందజేయాలని, ఆరోగ్య కార్డులను ఇవ్వాలని కోరారు. కేజీబీవీలో పనిచేస్తున్న, సమగ్ర శిక్షా ఉద్యోగులకు కనీస మూల వేతనం ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ అనిల్ కుమార్, వెంకటయ్య, వెలుగు రమేష్, ధరావతు లాలు, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యానాయక్‌తండాలో శనివారం తండాయూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, మండల యూత్ అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్, పెసర సతీష్‌రెడ్డి, బి. రాజేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో ఏలేటి వీరారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఏలేటి శ్యాంరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి శనివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ క్రీడాకారులకు 190 టీ షర్టులను అందజేశారు.

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

ఆత్మకూర్(ఎస్) : ఈ నెల 18న కొత్తగూడెంలో జరిగే ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని మండల ఆటో వర్కర్స్ యూని యన్ నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బోయిని నాగరాజు, చిత్తలూరు వెంకన్న, మొరిశెట్టి రాములు, గిలకత్తుల మహేష్, చిత్తలూరి నాగరాజు, కప్పల మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

పూల రవీందర్ గెలుపు కోసం ప్రచారం


ప్రచారం చేస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఐక్య సంఘాల కార్యాచరణ సమితి, టీఎంఎస్‌టీపీ బలపరిచిన అభ్యర్థి పూల రవీందర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ, టీఎంఎస్‌టీపీ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో పూల రవీందర్‌ను గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ నాయుడు, శంకర్ నాయక్, రమేష్, మల్లయ్య, సైదులు, మధు, క్రాంతి, కిరణ్, సతీష్, మల్లికార్జున్ రెడ్డి, అంజి, సలీం, గణేష్, వీరభద్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం


సూర్యాపేట : సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న చేనేత నాయకులు


తుంగతుర్తిలో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న జీపీ సిబ్బంది

సూర్యాపేట : చేనేత అభయ హస్తం ద్వారా నేతన్నలకు పొదుపు, భద్రత, భరోసా పథకాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలపడం హర్షణీయమని సూర్యాపేట చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కడారి భిక్షం అన్నారు. శనివారం సూర్యాపేట జిల్లా చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం ప్రధాన కార్యదర్శి చిలువేరు నరసింహారావు, కోశాధికారి బాల్నే మల్లయ్య, నాగుల శ్రీనివాస్, ముశం హరి, యలగందుల సాయినేత, సంగిశెట్టి ఆంజనేయులు, మోత్కూరి మధు, ముషం వెంకటనారాయణ, రుద్ర దామోదర్, లక్ష్మయ్య, శివాజీ, మార్కండేయ, వెంకటేశ్వర్లు, సూర్యం పాల్గొన్నారు.

చేనేత అభయహస్తం జీఓపై హర్షం

చేనేత కార్మికులకు అభయహస్తం పథకం జీఓ విడుదల చేయడం హర్షణీయమని సూర్యాపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మిట్టకోళ్ల సతీష్ అన్నారు. శనివారం కొత్తబస్టాండ్ సమీపంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేసే స్థలంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు సతీష్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి మిట్టకోళ్ల మధు, యువజన సంఘం నాయకులు రవి, ఉపాధ్యక్షుడు ఓట వీరయ్య, సహాయ కార్యదర్శి పరకాల శ్రీనివాస్, కార్యదర్శి సంగిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం నేతన్న పొదుపు, నేతన్న భరోసా పథకాలకు జీఓ విడుదల చేయడం పట్ల శనివారం పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చేనేత ఐక్య వేదిక ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తుంగతుర్తి శాసన సభ్యుడు సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కార్యదర్శి వంగరి బ్రహ్మం, మజ్జూరి రాములు, రామ్మూర్తి, వెంకటయ్య, సోమకృష్ణ, రవి, శేఖర్, సోమనర్సయ్య, కోటయ్య, సత్యనారాయణ, కొండయ్య, కళ్యాణి, గీత పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ఆధ్వర్యంలో..

అర్వపల్లి : గ్రామ పంచాయతీల్లో పనిచేసే కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతినెలా మొదటివారంలో వారి ఖాతాల్లోకి నేరుగా వేతనాలు వేస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై మండల జీపీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం అర్వపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఊట్కూరి భీముడు, జిల్లా ఉపాధ్యక్షుడు బోయపల్లి వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మంపాటి రవీందర్, నాయకులు కుంభం రామ్మూర్తి, సైదుల సతీష్, బైరబోయిన నర్సయ్య, మంద నాగార్జున, దేవరకొండ నర్సయ్య, చిలకల సుధాకర్ రెడ్డి, పాల్వాయి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం

తుంగతుర్తి : గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీలోపు వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క, ఎమ్మెల్యే సామేల్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుశలవచారి, మండల అధ్యక్షుడు సింగల్‌రావు, గుగులోతు సుమన్, ఆకారపు వెంకన్న, లింగయ్య, గోపి, స్కైలాబ్, కొమ్ము కృష్ణ, వెంకన్న, కిషన్, రాములు, వెంకటయ్య, బోసు పాల్గొన్నారు.


సూర్యాపేట : సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు


అర్వపల్లిలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గ్రామ పంచాయతీ ఉద్యోగులు


తిరుమలగిరిలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోని గత స్మృతులను గుర్తుచేసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్, శ్రావణ్‌కుమార్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం

నూతనకల్ : సీఎం రేవంత్‌రెడ్డి గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని కల్లుగీత కార్మిక పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, రాష్ట్ర కమిటీ సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. 2లక్షల 50వేల మంది గీత కార్మికులు ఉండగా కేవలం 10వేల మందికి మాత్రమే కాటమయ్య రక్షణ కవచాలు అందించడం సరికాదన్నారు. మృతి చెందిన గీత కార్మికుల కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సహాయం కోరారు. కార్యక్రమంలో బూడిద మల్లయ్య, మారగాని వెంకటచలం, మొగుళ్ల వెంకన్న, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు


సూర్యాపేట టౌన్ : జయ ఒలింపియాడ్ పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


అర్వపల్లి : మాంటిస్సోరి పాఠశాలలో..

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాలలో శనివారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు ముగ్గుల పోటీలో పాల్గొని రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

సూర్యాపేట : పట్టణంలోని బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో దాత అనంతుల రవిశేఖర్ శనివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి దాత అనంతుల రవిశేఖర్ తన తండ్రి రామమూర్తి చిల్డ్రన్స్ రికగ్నేషన్ పేరిట బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతుల జయమ్మ, బాల్ భవన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని మాంటిస్సోరి పాఠశాలలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలాగే సంక్రాంతి పండుగకు సంబంధించిన గాలి పతంగులు ఎగురవేయడం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ విపిన్‌కుమార్, ఇంచార్జ్ గిరిజ, ఉపాధ్యాయులు అమర్, చంద్రశేఖర్, రమ, రజిత, దేవేంద్ర, నిఖిత పాల్గొన్నారు.


సూర్యాపేట : బహుమతులతో జిల్లా కేంద్రంలోని బాల భవన్ విద్యార్థులు

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి


తుంగతుర్తిలో రాస్తారోకో చేస్తున్న నాయకులు

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించి మాట్లాడారు. రైతు భరోసా రూ.15,000 ఇవ్వాలని, మహిళలకు రూ.2500 ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులందరికీ ఎకరానికి రూ.15వేలు రైతు భరోసా ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఎకరాకు రూ.12000 మాత్రమే ఇస్తామని క్యాబినెట్‌లో తీర్మానం చేయడం రైతులకు నమ్మక ద్రోహం చేయడమే అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీనివాస్, మట్టిపల్లి శ్రీశైలం, గాజుల యాదగిరి, కొండగడుపుల నాగయ్య, లకావత్ దశరథ, వీరన్ననాయక్, విజయ్, తెడ్డు హరిబాబు, లింగయ్య పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో శిశువు మృతదేహం లభ్యం


మగ శిశువు మృతదేహం

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నంద్యాలగూడెం గ్రామ శివారులో నంద్యాల కృష్ణారెడ్డి వ్యవసాయ క్షేత్రానికి సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో శనివారం మగ శిశువు మృతదేహం లభ్యమైంది. మిరప చేలకు మందులు పిచికారీ చేసే రైతులు నీటి కోసం ఎస్సారెస్పీ కాలువ వద్దకు వెళ్లగా.. శిశువు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. శిశువు పుట్టి 24 గంటలు కూడా దాటలేదని తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ శిశువు మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శిశువు మృతిచెందిన తర్వాతే కాలువలో వదిలి వెళ్లారా.. లేక శిశువుని వదిలించుకోవడానికి ఇక్కడ వదిలి వెళ్లారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మద్దిరాల : మద్యానికి బానిసై వ్యక్తి ఉరి వేసుకొని మృతి చెందిన సంఘటన మద్దిరాలలో ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ ఎం.వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల గ్రామానికి చెందిన ఎల్లు వెంకట్‌రెడ్డి (43) జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. అతడు సుమారు 10 ఏళ్లుగా తాగుడుకు బానిస అయ్యాడు. అతడికి గత కొద్ది రోజుల నుంచి కామెర్లు కావడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల 3న తన ఇంటి సమీపంలోని బొలగాని మల్లయ్యకు చెందిన పడావుపడిన పశువుల కొట్టంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అతడి మృతదేహాన్ని ఎవరూ గమనించకపోవడంతో శనివారం వరకు అలాగే ఉంది. దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం చేయించి బంధువులకు అప్పగించారు. మృతుడి భార్య ఎల్లు అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వాహనాల తనిఖీ

తిరుమలగిరి : ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. శనివారం తిరుమలగిరిలో వాహనాలను తనిఖీ చేశారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్విచక్ర వాహనదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీసులు పాల్గొన్నారు.